క్లుప్తంగా

నేటి నుంచి గాలి గంగాలమ్మ తల్లి జాతర



అమ్మవారి జాతర ఉత్సవాలను ప్రారంభిస్తున్న నాయకులు

పిఠాపురం: పట్టణంలో ఉన్న గ్రామ దేవత గాలి గంగాలమ్మ తల్లి జాతర మహోత్సవాలు శుక్రవారం నుంచి ప్రారంభం కానున్నాయి. సుమారు 150 ఏళ్ల చరిత్ర కలిగిన ఈ అమ్మవారు ఆలయం వద్ద ఏటా 15 రోజుల పాటు అమ్మవారి జాతర కార్యక్రమం నిర్వహిస్తుంటారు. గురువారం అమ్మవారి జాతర మహోత్సవాన్ని 13వ వార్డు కౌన్సిలర్ తల్లి శెట్టి వెంకటేశ్వరరావు, మాజీ కౌన్సిలర్ రెడ్డెం భాస్కరరావు, శ్రీపాద వల్లభ దేవస్థానం మాజీ చైర్మన్ రెడ్డెం జనార్దన్, కో–ఆపరేటివ్ అర్బన్ బ్యాంక్ మాజీ చైర్మన్ బాలిపల్లి రాంబాబు తదితరులు ప్రత్యేక పూజలు నిర్వహించి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో పిఠాపురం పట్టణ ఆటో యూనియన్ ప్రెసిడెంట్లు దవులూరి రాంబాబు, లచ్చుబాబు, మేకల పద్మారావు, మాజీ కౌన్సిలర్ బండి రాఘవ, రెడ్డెం రాజబాబు తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి స్కూల్ గేమ్స్

సామర్లకోట: ప్రతి ఏటా విద్యార్థులకు నిర్వహించే స్కూల్ గేమ్స్‌లో భాగంగా శుక్రవారం నుంచి మండల స్థాయి పోటీలు స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆవరణలో జరుగుతాయని ఎంఈఓ వై శివరామ కృష్ణయ్య తెలిపారు. గురువారం ఆయన ఇక్కడ విలేకర్లతో మాట్లాడుతూ, శుక్రవారం బాలురకు, శనివారం బాలికలకు పోటీలు ఉంటాయని వివరించారు. పోటీలను ఎమ్మెల్యే నిమ్మకాయల చినరాజప్ప, మున్సిపల్ చైర్‌పర్సన్ గంగిరెడ్డి అరుణ, ఎంపీపీ బొబ్బరాడ సత్తిబాబు ప్రారంభిస్తారని చెప్పారు. విజేతలకు నియోజకవర్గ స్థాయిలో 23వ తేదీన స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆవరణలో పోటీలు నిర్వహిస్తారని తెలిపారు.

నేటి నుంచి టీటీ పోటీలు

పెద్దాపురం: సీబీఎస్ఈ క్లస్టర్ స్థాయి టేబుల్ టెన్నిస్ పోటీలు శుక్రవారం నుంచి మూడు రోజుల పాటు స్థానిక శ్రీప్రకాష్ సినర్జీ పాఠశాలలో నిర్వహిస్తున్నట్టు టీటీ సంఘ సీనియర్ వైస్ ప్రెసిడెంట్ సీహెచ్.విజయ్‌ప్రకాష్ తెలిపారు. ఈ మేరకు గురువారం ఆయన ఓ ప్రకటన విడుదల చేశారు. ఉభయ రాష్ట్రాల్లో ఉన్న 50 సీబీఎస్ఈ పాఠశాలల నుంచి సుమారు 350 మంది క్రీడాకారులు ఈ పోటీల్లో పాల్గొంటారన్నారు. వివిధ కేటగిరీల్లో సుమారు 12 విభాగాల్లో పోటీలు జరుగుతాయని చెప్పారు. జేఎన్‌వీ ఫిజికల్ డైరెక్టర్ అనురాధ పోటీలకు పరిశీలకులుగా, చీఫ్ రిఫరీలుగా రమణకుమార్; పి.వేణు వ్యవహరిస్తారని తెలిపారు.

మండల స్థాయి క్రీడా పోటీలు ప్రారంభం



వాలీబాల్ ఆడి పోటీలు ప్రారంభిస్తున్న నాయకులు

పెద్దాపురం: మండల స్థాయిలో ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల విద్యార్థులకు అండర్–15, 17 విభాగాల్లో క్రీడా పోటీలు గురువారం స్థానిక మహారాణి కళాశాలలో ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమానికి ఎంఈఓ ప్రభాకరవర్మ అధ్యక్షత వహించారు. పలువురు వక్తలు మాట్లాడుతూ క్రీడలు శారీరక, మానసికోల్లాసానికి దోహదపడతాయన్నారు. విద్యార్థి దశ నుంచే క్రీడలపై ఆసక్తి కనబర్చాలన్నారు. క్రీడల్లో నైపుణ్యం ప్రదర్శించి ప్రతి ఒక్కరూ రాణించాలని ఆకాంక్షించారు. అనంతరం జేఎస్పీ జిల్లా అధ్యక్షులు తుమ్మల బాబు వాలీబాల్ ఆడి క్రీడలను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ అశోక్‌కుమార్, ఇతర నాయకులు పాల్గొన్నారు.

డ్రాపౌట్స్ సమీక్షలతో సతమతం

బాలాజీచెరువు: ప్రభుత్వ పాఠశాలల్లో డ్రాపౌట్స్ తగ్గించాలనే ఉద్దేశంతో ప్రభుత్వం చేపడుతున్న కార్యక్రమంపై ఉపాధ్యాయులు, ఉపాధ్యాయ సంఘాల వారు మండిపడుతున్నారు. విద్యార్థులకు సిలబస్ బోధించకుండా, డ్రాపౌట్స్‌పై సమీక్షలు, సర్వేలంటూ రాత్రి పది గంటల వరకూ ఉపాధ్యాయులను జిల్లా విద్యాశాఖాధికారి కార్యాలయంలో ఉంచుతున్నారని, వీరిలో ముఖ్యంగా మహిళలతో పాటు, 50 ఏళ్ల పైబడిన వారున్నారని ఉపాధ్యాయులు వాపోతున్నారు. ఇప్పటికే గత రెండు నెలల కాలంలో తుపాను సెలవులు అధికంగా వచ్చాయని, ఇప్పుడు మళ్లీ ఉపాధ్యాయులను పాఠాలు బోధించనీయకుండా డ్రాపౌట్స్ సమీక్ష పేరుతో సమయం వృథా చేస్తున్నారన్నారు. జిల్లావ్యాప్తంగా సగటున చేస్తే డ్రాపౌట్ సంఖ్య వెయ్యికి మించి ఉండదని, దీనికి దాదాపు 18 వేల మంది విద్యార్థులకు తరగతులు బోధించే ప్రధాన ఉపాధ్యాయులు ఈ సమావేశాలకు రావడంతో, విద్యార్థులు తీవ్రంగా నష్టపోతున్నారన్నారు. ఉపాధ్యాయులపై అదనపు భారం ఉండదని చెప్పిన ప్రభుత్వం ఈ విధమైన నిర్ణయంతో ఆవేదన చెందుతున్నామని స్పష్టం చేశారు. దీనిపై జిల్లా అధికారులు స్పందించాలని ప్రధాన ఉపాధ్యాయుల సంఘం కోరింది.

భృతిపై బూటకపు శృతి

మంచి చదువులు చదివారు. మంచి ఉద్యోగం వచ్చి.. జీవితంలో స్థిరపడవచ్చని ఆశించారు. ఇంటికో ఉద్యోగం ఇస్తామని కూటమి నేతలు ఎన్నికల్లో ఊదరగొట్టడంతో.. నిజమేననుకుని నమ్మారు ఆ నిరుద్యోగులు. ఉద్యోగం వచ్చే వరకూ నిరుద్యోగ భృతి ఇస్తామని 'గ్యారంటీ' ఇవ్వడంతో.. ఎంతో విశ్వాసంతో ఆ పార్టీలకు ఓట్లు వేశారు. తీరా అధికారం చేపట్టాక కూటమి నేతలు తూచ్ అనడంతో.. సరిదిద్దుకోలేని తప్పు చేశామేమోనని ఇప్పుడు ఆ నిరుద్యోగులు మథనపడుతున్నారు.

- నియోజకవర్గంలో 96 వేల కుటుంబాలు
- పెద్దాపురంలో 22 వేల మంది నిరుద్యోగులు
- పిఠాపురంలో జీవనోపాధికి వేచిచూస్తున్న 18 వేల మంది
- నిరుద్యోగ భృతి, ఉద్యోగాల కోసం ఎదురు చూపులు



పెద్దాపురం పట్టణంలోని ముఖ్య కూడలి

సామర్లకోట: పెద్దాపురం నియోజకవర్గంలో దాదాపు 96 వేల కుటుంబాలు ఉండగా, వీరిలో సుమారు 22 వేల వరకు నిరుద్యోగులు ఉన్నట్టు అంచనా. అలాగే పిఠాపురం నియోజకవర్గంలో పిఠాపురం మున్సిపాలిటీ, గొల్లప్రోలు నగర పంచాయతీ, యు.కొత్తపల్లి, పిఠాపురం, గొల్లప్రోలు మండలాలుండగా, మొత్తం 51 గ్రామ పంచాయతీలున్నాయి. పిఠాపురం నియోజకవర్గంలో మొత్తం 98 వేల కుటుంబాలుండగా, సుమారు 18 వేల మంది నిరుద్యోగులు ఉన్నారని గణాంకాలు చెబుతున్నాయి. ఎన్నికల మేనిఫెస్టోలో కూటమి నేతలు కుటుంబానికి ఓ ఉద్యోగం ఇస్తామని, అది కూడా చదువు, వయస్సుతో సంబంధం లేదని హామీ ఇచ్చింది. దీంతో, తాము ఆ హామీని గుడ్డిగా నమ్మి ఓట్లు వేశామని ప్రజలు చెబుతున్నారు. కొన్ని కుటుంబాల్లో ఇద్దరు నుంచి ముగ్గురు కూడా నిరుద్యోగులున్నారు. కొంత మంది 35 ఏళ్లు దాటి పోవడంతో ఉద్యోగం రాకుండానే ఇళ్లకే పరిమితమయ్యారు.

పెద్దాపురం నియోజకవర్గ పరిధిలో రెండు మున్సిపాలిటీలు, రెండు మండలాలు ఉన్నాయి. మండలాల పరిధిలో సామర్లకోట మండలంలో 18 గ్రామాలు, పెద్దాపురం మండలంలో 23 గ్రామాలున్నాయి. ప్రైవేటు, ప్రభుత్వ రంగాల్లో ఉద్యోగ ప్రకటనలు పడ్డాక, ఉద్యోగాలకు దరఖాస్తులు చేసుకోవడానికి నిరుద్యోగులు ఇప్పటికీ తల్లిదండ్రులపై ఆధారపడాల్సి వస్తోంది. కూటమి ప్రభుత్వం ప్రతి కుటుంబానికి ఓ ఉద్యోగం ఇస్తామని, నిరుద్యోగ భృతి ఇస్తామని ప్రకటించడంతో, తమ తల్లిదండ్రులపై ఆధారపడాల్సిన అవసరం ఉండదని నిరుద్యోగులు ఆనందపడ్డారు. అయితే ఇప్పటి వరకూ నిరుద్యోగులకు ఉద్యోగాలు కాదు కదా, కనీసం నిరుద్యోగ భృతికి సంబంధించి సర్వేలు కానీ, ఆ మేరకు ప్రకటనలు కానీ రాకపోవడంతో.. ఆ హామీలు నిజంగా అమలు చేస్తారా అనే అనుమానాలను నిరుద్యోగులు వ్యక్తం చేస్తున్నారు. అదేవిధంగా సామర్లకోటలో ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఏర్పాటు చేస్తానని స్థానిక ఎమ్మెల్యే ఇచ్చిన హామీపై ఇప్పటి వరకు ఎటువంటి ప్రతిపాదనలు జరగకపోవడం సర్వత్రా విస్మయాన్ని కలిగిస్తోంది.

కూలీ పనికి వెళ్లలేకపోతున్నాం



కుటుంబ సభ్యులు కష్టపడి చదివించడంతో బీకాం పూర్తి చేశాను. ఉద్యోగం కోసం ప్రయత్నాలు చేస్తున్న సమయంలో కూటమి నాయకులు నిరుద్యోగులకు శుభవార్తగా ఇంటికి ఒక ఉద్యోగం ఇస్తామని హామీ ఇచ్చారు. దాంతో నాలో ధైర్యం ఏర్పడింది. ఇప్పటి వరకు దానిపై ఎటువంటి ఆలోచన చేయకపోవడంతో ఆందోళన చెందుతున్నాం. చదువుకోవడంతో కూలీ పనికి వెళ్లలేని పరిస్థితి.

– వట్టికూటి రాజ్‌కుమార్, నిరుద్యోగి, దివిలి, పెద్దాపురం మండలం

హామీని అమలు చేయాలి



నిరుద్యోగులకు ఇచ్చిన హామీని అమలు చేయాలి. ఉద్యోగం వచ్చే వరకు కనీసం నిరుద్యోగ భృతి ఇవ్వాలి. దాంతో కుటుంబానికి కొంతైనా భారం తగ్గుతుంది.

– సూతి అరుణ, నిరుద్యోగి, చదలాడ, పెద్దాపురం మండలం

ప్రజలకు అండగా ఉంటాం..



కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీలు అమలు చేసే వరకూ ప్రజలకు అండగా ఉండి పోరాటం చేస్తాం. నిరుద్యోగులకు ఇచ్చిన హామీ మేరకు ఇంటికో ఉద్యోగం, అప్పటివరకూ నిరుద్యోగ భృతిని అమలు చేయాలి. వైఎస్సార్ సీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు మా పోరాటాలు ఉంటాయి. రాజకీయాల్లో గెలుపోటములు సహజం. మా నాయకుడు జగన్ గత ఎన్నికల్లో ఇచ్చిన హామీల్లో 99 శాతం అమలు చేసి చూపించారు. అమలు చేయగలిగే హామీలనే ఆయన ఇచ్చారు.

– దవులూరి దొరబాబు, కో–ఆర్డినేటర్, వైఎస్సార్ సీపీ పెద్దాపురం నియోజకవర్గం, సామర్లకోట

ఉద్యోగ ప్రకటన కోసం చూస్తున్నా..



డిప్లొమా చేశాక, బీటెక్ ఈఈఈ పూర్తి చేశాను. ఉద్యోగం కోసం ప్రయత్నిస్తున్నాను. కూటమి ప్రభుత్వం ఇంటికో ఉద్యోగం ఇస్తామని, అప్పటి వరకు నిరుద్యోగ భృతి ఇస్తామని ఎన్నికల్లో హామీ ఇవ్వడంతో, ప్రభుత్వ ప్రకటన కోసం ఎదురు చూస్తున్నాం. ఇప్పటి వరకు ప్రభుత్వం ఎలాంటి చొరవ చూపడం లేదు. ఇచ్చిన హామీని అమలు చేయాలి.

– తోటకూర వెంకటేష్, నిరుద్యోగి, పీబీ దేవం, సామర్లకోట మండలం

నిరుద్యోగ భృతి కోసం..



రాష్ట్ర ప్రభుత్వం నిరుద్యోగ భృతి అందజేస్తే, ఆ మొత్తంతో ప్రభుత్వ ఉద్యోగాలకు సంబంధించి కోచింగ్ తీసుకోవడానికి అవకాశం ఉంటుంది. ఉద్యోగం లేకపోవడంతో తల్లిదండ్రులపై ఆధారపడటం బాధగా ఉంది. గతంలో మాదిరిగా కాకుండా, సీఎం చంద్రబాబు ఇచ్చిన మాట నిలబెట్టుకోవాలి.

– సింగంశెట్టి మణికంఠ, నిరుద్యోగి, సామర్లకోట

ఫార్మసీ కళాశాల ప్రిన్సిపాల్ మధుకు డాక్టరేట్



డాక్టరేట్ అందుకుంటున్న మధు

పెద్దాపురం: మండలంలోని దివిలి కిట్స్ ఫార్మసీ కళాశాల ప్రిన్సిపాల్ గుడిపాటి మధుకు ప్రతిష్ఠాత్మకమైన అమెరికా డాక్టర్ ఆఫ్ సైన్స్ డాక్టరేట్‌ను ప్రదానం చేసింది. ఆయన పీహెచ్‌డీ అభ్యసించడానికి యూనివర్సిటీ గ్రాంట్స్ కమిషన్ (యూజీసీ) ఆర్థిక సాయాన్ని ఫెలోషిప్ రూపంలో అందించింది. ఫార్మాస్యూటికల్ సైన్సెస్ రంగంలో ఆయన ఇప్పటికే ఆరు పుస్తకాలను రచించారు. అలాగే మల, పెద్దపేగు క్యాన్సర్‌కు సహజ నివారణలు, ఫావిపిరావిర్ రూపకల్పన, క్యారెక్టరైజేషన్, ఇన్ విట్రో మూల్యాంకనంపై మూడు పుస్తక అధ్యయనాలకు ఆయన తన సహకారాన్ని అందించారు. ఒరోడిస్పెర్సిబుల్ ఫిల్మ్, స్కోపస్, వెబ్ ఆఫ్ సైన్స్, ఎల్సివియర్ వంటి ప్రసిద్ధ పత్రికల్లో 57 పరిశోధన సమీక్ష కథనాలను ప్రచురితం కావడానికి ఆయన ఎంతో కృషి చేశారు. ఇప్పటికే ఆయన యంగ్ సైంటిస్ట్ అవార్డు (న్యూఢిల్లీ), యంగ్ ఫ్యాకల్టీ, ఉత్తమ ఫ్యాకల్టీ, యంగ్ ఫార్మసీ ఫ్యాకల్టీ, యంగ్ ప్రొఫెషనల్ డెవలప్‌మెంట్ అవార్డులను అందుకున్నారు. జేఎన్టీయూకే వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ కేవీఎస్‌జీ మురళీకృష్ణ సమక్షంలో డాక్టర్ ఆఫ్ సైన్స్ అవార్డును అందుకున్నారు. భారతదేశంలో కేవలం కొద్ది మందికి మాత్రమే ఇటువంటి అరుదైన డాక్టరేట్ లభించినట్టు మధు తెలిపారు. డాక్టరేట్ అందుకున్న మధును కళాశాల చైర్మన్ బేతినీడి శ్రీనివాసరావు, ఈఓ జెన్నిబాబు తదితరులు అభినందించారు.

కొనసాగుతున్న గణపతి నిమజ్జనాలు



సామర్లకోట గోదావరి కాలువలో విగ్రహాలను నిమజ్జనం చేస్తున్న మహిళలు



ఉప్పాడ వద్ద గణపతిని నిమజ్జనానికి తరలిస్తున్న భక్తులు

సామర్లకోట: గణపతి నవరాత్రి ఉత్సవాలు ముగియడంతో నిమజ్జన కార్యక్రమాలు గురువారం కొనసాగాయి. ఇందులో భాగంగా ఆయా శిబిరాల వద్ద ఏర్పాటు చేసిన గణపతి విగ్రహాలను ప్రత్యేక వాహనాలపై ఉంచి, ఊరేగింపుగా సామర్లకోట పంచారామ క్షేత్ర ముఖద్వారం వద్ద ఉన్న గోదావరి కాలువ రేవు వద్దకు తీసుకొచ్చారు. సామర్లకోటలోని విగ్రహాలతో పాటు, పెద్దాపురం మండలం పులిమేరు గ్రామంలో ఉన్న గణపతి విగ్రహాలను ఊరేగింపుగా సామర్లకోట గోదావరి రేవు వద్దకు తెచ్చి నిమజ్జనాలు చేశారు. పిల్లలు, పెద్దలు, మహిళలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. సీఐ ఎ.కృష్ణభగవాన్ ఆధ్వర్యంలో బందోబస్తు ఏర్పాట్లు చేశారు. రెవెన్యూ, హెల్త్ సిబ్బంది పర్యవేక్షించారు.

కళకళలాడిన సాగర తీరం

కొత్తపల్లి: గణపతి నవరాత్రుల ముగింపు సందర్భంగా ఉప్పాడ సాగర తీరం గణనాథుని నిమజ్జనాలతో గురువారం కళకళలాడింది. వందకు పైగా విగ్రహాలను సముద్రంలో నిమజ్జనం చేశారు. వేలాది మంది భక్తులు పుణ్య స్నానాలను ఆచరించారు. రాత్రి వరకు నిమజ్జనోత్సవాలతో సాగర తీరం కిక్కిరిసిపోయింది. గ్రామాల్లో ఉన్న వినాయక విగ్రహాలను మేళతాళాలు, బాణసంచా కాల్పులతో ఊరేగించారు. ఉప్పాడ తీర ప్రాంతంలో మండలం నుంచే కాకుండా, పిఠాపురం, గొల్లప్రోలు తదితర మండలాల్లోని వివిధ గ్రామాల నుంచి వందలాది విగ్రహాలను లారీలు, ట్రాక్టర్లు, ఆటోలపై ఊరేగింపుగా తరలించారు. భజనలు, నత్యాలు,



సామర్లకోట గోదావరి కాలువ వద్దకు తరలిస్తున్న గణేశ్ విగ్రహం



ఉప్పాడ బీచ్ రోడ్డు వద్ద సముద్రంలో విగ్రహాలను నిమజ్జనం చేస్తున్న భక్తులు



ఉప్పాడ తీరంలో భక్తుల కోలాహలం

బాణసంచా తయారీలో నిబంధనలు పాటించాలి



వేట్లపాలెంలో బాణసంచా తయారీ షాపును తనిఖీ చేస్తున్న ఆర్డీఓ కిషోర్

- దుకాణం తనిఖీ చేసిన ఆర్డీఓ కిషోర్

సామర్లకోట: ప్రభుత్వ నిబంధనలను బాణసంచా తయారీదారులు తప్పనిసరిగా పాటించాలని కాకినాడ ఆర్డీఓ ఇట్ల కిషోర్ ఆదేశించారు. గురువారం మండలంలోని వేట్లపాలెం సూర్యం బాణసంచా షాపులో తనిఖీలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ప్రమాదాలకు కారణమయ్యే పదార్థాలను బాణసంచా తయారీలో ఉపయోగించరాదని ఆదేశించారు. బాణసంచా తయారీలో మహిళలు, పిల్లలను వినియోగిస్తే చర్యలు తీవ్రంగా ఉంటాయని హెచ్చరించారు. బాణసంచా తయారీలో అనుభవం ఉన్న వారితో మాత్రమే పని చేయించుకోవాలన్నారు. అగ్ని ప్రమాదాలను నివారించే పరికరాలు అందుబాటులో ఉండాలని తెలిపారు. ఈ మేరకు పరికరాల పనితీరును ఆర్డీఓ పరీక్షించారు. లైసెన్సులు లేకుండా బాణసంచా తయారు చేసే వారి వివరాలను సేకరించి, తమకు సమాచారం ఇవ్వాలన్నారు. ప్రమాదాలకు ఆస్కారం లేకుండా వ్యాపారాలు చేసుకోవాలని సూచించారు. ఆయన వెంట తహసీల్దార్ కొవ్వూరి చంద్రశేఖరరెడ్డి, సీఐ ఎ.కృష్ణభగవాన్, పెద్దాపురం అగ్నిమాపక, కార్మిక శాఖ అధికారులు, వీఆర్వోలు ఉన్నారు.

విద్యుత్ సరఫరాకు నేడు అంతరాయం

సామర్లకోట: పట్టణంలోని సబ్ స్టేషన్‌లో మరమ్మతులను పురస్కరించుకుని శుక్రవారం ఉదయం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని ఏపీఈపీడీసీఎల్ సామర్లకోట ఈఈ ఏవీఎస్‌డీఎస్ ప్రభాకర్ గురువారం సాయంత్రం ఒక ప్రకటనలో తెలిపారు. పట్టణంలోని కొత్తపేట, కోటబజార్, పాత తహసీల్దార్ కార్యాలయం, కుమ్మరవీధి, బలుసులపేట, సంత మార్కెట్, పెన్షన్ లైన్, మెహర్ కాంప్లెక్స్, పోస్టాఫీసు వీధి ప్రాంతాల్లో ఉదయం 7 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు విద్యుతు సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని చెప్పారు.

రోగులకు పండ్లు పంపిణీ

సామర్లకోట: ప్రధాని మోదీ జన్మదిన సేవా కార్యక్రమాల్లో భాగంగా గురువారం స్థానిక సామాజిక ఆరోగ్య కేంద్రంలో రోగులకు బీజేపీ నాయకులు పండ్లు పంపిణీ చేశారు. పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి గౌరకపూడి చిన్నయ్యదొర, ఇతర నాయకులు పాల్గొన్నారు.

పాము కాటుకు తక్షణ చికిత్స అవసరం



గొల్లప్రోలులో పాముకాటుపై అవగాహన కల్పిస్తున్న వైద్య సిబ్బంది

పిఠాపురం: పాముకాటుకు గురి కాకుండా ప్రతి ఒక్కరూ తగిన జాగ్రత్తలు పాటించాలని వైద్య నిపుణులు సూచించారు. గురువారం గొల్లప్రోలు పీహెచ్‌సీ సిబ్బంది ఆధ్వర్యంలో అంతర్జాతీయ పాము కాటు నివారణ దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్య సిబ్బంది గ్రామాల్లో పర్యటించి, పాము కాటుకు గురి కాకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలు, పాము కాటుకు గురైతే చేపట్టాల్సిన వైద్య సేవలపై అవగాహన కల్పించారు. గ్రామీణ పట్టణ ప్రజలు, ముఖ్యంగా వ్యవసాయ, ఉపాధి హామీ పనులు చేసేవారు, ఇతర మట్టి పనులు చేసే కూలీలు తగు జాగ్రత్తలు పాటించాలన్నారు. పాముల జీవన మనుగడకు ఇబ్బంది కలిగినపుడు ఇళ్లలో, ఇటుక బట్టీలు తదితర ప్రాంతాల్లో చేరుతాయన్నారు. పాముకాటు నుంచి కాపాడుకునేలా అందరికీ అవగాహన కల్పిస్తున్నామని గొల్లప్రోలు హెల్త్ సూపర్‌వైజర్ అహ్మద్ బాషా తెలిపారు. విష సర్పాలు చాలా ప్రమాదకరమైనవన్నారు. అన్ని ప్రభుత్వ ఆస్పత్రులు, ఏరియా ఆస్పత్రులు, పీహెచ్‌సీల్లో పాముకాటుకు తక్షణ చికిత్స ఉందన్నారు. పాముకాటుకు గురైతే, వెంటనే సమీప ఆస్పత్రికి తరలించాలని చెప్పారు. నాటు వైద్యం, మంత్రసానుల వద్దకు పోరాదన్నారు. పసర, ఆకు, అలమ వంటి వాటిని ఆశ్రయిస్తే ప్రమాదం తప్పదని హెచ్చరించారు. అన్ని ప్రభుత్వ ఆస్పత్రుల్లోను యాంటీ స్నేక్ వీనం ఉచితంగా అందుబాటులో ఉంటుందన్నారు.

సమష్టి కృషితోనే స్వచ్ఛ భారత్



రైల్వే ప్లాట్‌ఫాంపై ప్రయాణికులకు అవగాహన కల్పిస్తున్న అధికారులు

సామర్లకోట: ప్రతిఒక్కరి సంకల్పంతోనే స్వచ్ఛ సమాజ నిర్మాణానికి అవకాశం ఉంటుందని రైల్వే స్టేషన్ మేనేజర్ ఎం రమేష్ అన్నారు. స్వచ్ఛత హీ సేవా కార్యక్రమాల్లో భాగంగా గురువారం స్థానిక రైల్వే స్టేషన్ ప్లాట్‌ఫాంపై ప్రయాణికులకు స్వచ్ఛ భారత్‌పై అవగాహన కల్పించారు. ప్లాస్టిక్ గ్లాసులు, కవర్లను వాడరాదని, వాటివల్ల అనర్థాలు జరుగుతాయని వివరించారు. ఈ సందర్భంగా ప్లాట్‌ఫాంపైనా, స్టేషన్ ఆవరణలో ఉన్న ప్లాస్టిక్ బాటిళ్లు, కవర్లు, కాగితాలను తొలగించారు. ప్రయాణికులు, ఉద్యోగులతో కలిసి స్టేషన్ ఆవరణలో మానవహారం నిర్వహించారు. ఆయా కార్యక్రమాల్లో రైల్వే డాక్టర్ చెన్నకేశవరెడ్డి, హెల్త్ ఇన్‌స్పెక్టర్ కల్యాణి, చీఫ్ కమర్షియల్ ఇన్‌స్పెక్టర్ సంతోష్‌కుమార్, ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ గిరి, చీఫ్ గూడ్స్ సూపర్‌వైజర్ సత్యనారాయణ, పార్శిల్ సూపర్‌వైజర్ మోసిద్దీన్, ఆర్పీఎఫ్ ఎస్సై ఎస్ రామకృష్ణ, సీనియర్ సెక్షన్ ఇంజినీర్ శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

నాడు-నేడుకు రూ.1,400 కోట్లు అవసరం

- రాష్ట్ర ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ అకడమిక్ కో–ఆర్డినేటర్ నాగేశ్వరరావు



గొల్లప్రోలులో హైస్కూలును తనిఖీ చేస్తున్న నాగేశ్వరరావు

పిఠాపురం: రాష్ట్రంలో నాడు–నేడు పనులు పూర్తి చేయడానికి రూ.1,400 కోట్ల అవసరం ఉంటుందని ప్రాథమికంగా అంచనా వేసినట్టు రాష్ట్ర ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ అకడమిక్ కో ఆర్డినేటర్ కె.నాగేశ్వరావు చెప్పారు. ఆయన గురువారం గొల్లప్రోలు మండలంలో పలు నాడు–నేడు పనులు జరిగిన పాఠశాలలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో ఇప్పటివరకు 45 పాఠశాలలను ఫెంటాస్ పిక్చర్ లోపాలను గుర్తించినట్టు తెలిపారు. మౌలిక సదుపాయాలు అందించడంలో లోపాలు ఉండడంతో పనులు త్వరితగతిన పూర్తి కాలేదని గుర్తించామన్నారు. గత ప్రభుత్వంలో రూ 97 కోట్లు పెండింగ్ ఉందని, ఈ నిధులు సెంట్రల్ రిక్రూట్మెంట్ మెటీరియల్‌కు చెల్లించాల్సి ఉందని చెప్పారు. డిసెంబర్ నాటికి పనులన్నీ పూర్తి చేయాల్సి ఉందని. దీనిపై నివేదికను కమిషనరేట్‌కు 20 రోజుల్లో సమర్పిస్తారని తెలిపారు. కొన్ని జిల్లాల్లో పాఠశాలపై ఫిర్యాదులు అందాయని, వాటితో పాటు మరి కొన్నింటిని తనిఖీ చేస్తున్నట్టు చెప్పారు. గొల్లప్రోలు మండలంలోని ఎ.విజయనగరం పాఠశాలతో పాటు, మరో నాలుగు పాఠశాలలపై విచారణ నిర్వహించామన్నారు. చేబ్రోలు, దుర్గాడ, ఎ.విజయనగరం, గొల్లప్రోలు తదితర పాఠశాలలను పరిశీలించారు. రాష్ట్రంలో పాఠశాలల్లో మిగిలిన పనులను పూర్తి చేయడానికి మరో నెల రోజుల్లో పనులు ప్రారంభించేందుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఆయన వెంట గొల్లప్రోలు ఎంఈఓ2 ప్రసాద్ ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ గౌతు వెంకటరమణ తదితరులు ఉన్నారు.